క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన పీడీ


అంగన్‌వాడీలకు సూచనలిస్తున్న పీడీ సువర్ణ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్‌లతో పాటు కార్యకర్తలకు పలు సూచలను చేశారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ కమలకుమారి, సూపర్‌వైజర్లు అంజమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాల పరిశీలన


బ్యాంకింగ్ వ్యవస్థను పరిశీలిస్తున్న నాగరాజు

దొనకొండ: స్థానిక పీఎంశ్రీ పాఠశాలలోని సౌకర్యాలు, పని తీరును జిల్లా సమగ్ర శిక్షా అధికారులు నాగరాజు, శివాజీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో ఉన్న ఒకేషనల్ కోర్సులు, బ్యాంకింగ్, టైలరింగ్, ఎలక్ట్రానిక్స్ క్రీడలు, లైబ్రరీ, ఫిజిక్స్ ల్యాబ్‌లు, కరణం మల్లేశ్వరి క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఉన్న ఎన్‌సీసీ యూనిట్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, తదితర విషయాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులును అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రిపోర్టును జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా గాయత్రి అమ్మవారు

గిద్దలూరు రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలోని కాశినాయన కుంటలో ఉన్న గాయత్రిమాత ఆలయంలో సోమవారం అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రకృతి స్వరూపమైన అమ్మవారిని కూరగాయాలతో అలంకరించడంలో దాగి ఉన్న విశిష్టతను అర్చకులు వివరించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇరుకు రోడ్లతో అవస్థలు

- రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు
- రాకపోకలకు తప్పని తిప్పలు


మండల కేంద్రం పెద్దదోర్నాల తిమ్మాపురంలో ట్రాఫిక్ ఇబ్బందులు

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాలలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలంగా మారుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సదుపాయాలు మెరుగుపడక పోవడంతో అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని తిమ్మాపురం రహదారిలో తరుచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాదారులు రోడ్డుకు రెండు వైపులా తమ దుకాణాల్లోని సామాన్లను డిస్‌ప్లేకు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ఇరుకు దారులతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు, వినియోగదారులు ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా మండల కేంద్రం పెద్దదోర్నాలకు రావల్సిందే. ఈ నేపథ్యంలో ముఖ్యంగా కిరాణా షాపులు, వస్త్ర దుకాణాలతో పాటు ప్రజలకు అవసరమయ్యే అన్ని దుకాణాలు తిమ్మాపురం రహదారిలోని కన్యకా పరమేశ్వరి ఆలయ సమీపంలో ఉండటం గమనార్హం. దీంతో మండల కేంద్రంలోని గుంటూరు-కర్నూలు రోడ్డు నుంచి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ఉన్న దుకాణాల్లో కొనుగోలుదారులతో ఈ రహదారి అన్ని వేళల్లో అత్యంత రద్దీగా ఉంటోంది. అయితే కొందరు దుకాణదారులు పోటీలు పడి తమ షాపుల్లో ఉండే వస్తువులను రోడ్లపైనే పెట్టి అమ్మకాలు సాగిస్తుంటారు. మండల కేంద్రమైన దోర్నాల నుంచి తిమ్మాపురం గ్రామానికి అత్యంత ముఖ్యమైన రహదారి ఇదే. పలు వాహనాలు ఈ రహదారి నుంచి వెళ్తుంటాయి. దీంతో ఈ రహదారి మరింత ఇరుకుగా మారి పాదాచారులు కూడా వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతుంటాయి. దీంతో రోడ్డు విస్తరణపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. తిమ్మాపురం గ్రామంతో పాటు ఇదే మార్గంలో ఉన్న ఏకలవ్య మోడల్ పాఠశాలకు సంబంధించి పలువురు అధికారులతో పాటు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన నిర్మాణ సామగ్రి ఈ రహదారి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఎక్కువగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో పాటు కొనుగోలుదారులు తమ ద్విచక్ర వాహనాలతో పాటు సమీప గ్రామీణ ప్రాంత వాసులు తమకు అవసరమైన వస్తువులను తీసుకెళ్లేందుకు తమతో పాటు తీసుకొచ్చిన ఆటోలను రోడ్లపైనే నిలిపి ఉంచటంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది. దీనికి తోడు దుకాణాదారులకు సంబంధించి సరుకులు తెచ్చే వాహనాలు సైతం రోడ్డుపై నిలిపి ఉంచటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతోంది. అధికారులు సమస్యను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

షిర్డీ సాయి సత్సంగ మందిరంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెద్దదోర్నాల: షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని 41 రోజులు పూర్తయిన నేపథ్యంలో స్థానిక షిర్డీ సాయి ఆలయంలో 41 రోజుల పండగను మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీశైలం రోడ్డులో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయి సత్సంగ మందిరంలో 41 రోజుల క్రితం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు చేపట్టారు. సోమవారం ఆలయంలో భక్తులు ప్రత్యేకంగా నైవేద్యాలు సమర్పించారు. ఆలయంలో నూతనంగా శివ,నందీశ్వరుల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి రావడంతో మందిరం భక్తులతో కిటకిటలాడింది. బాబా దివ్య దర్శనం చేసుకున్న భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు.


ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

వేకువ జామున బాబాను పట్టువస్త్రాలు, ప్రత్యేక పూలమాలలతో అలంకరించారు. తెల్లవారు జామున 5 గంటలకు కాకడ హారతి అనంతరం పాలతో బాబాను అభిషేకించారు. ఆలయ అర్చకులు, భక్తులతో సాయి సత్యవ్రతం, పూజా క్రతువు, వ్రతాలు నిర్వహించారు. అలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నదానం చేశారు.

బోరు పైపులకు మరమ్మతులు చేయాలి

పెద్దారవీడు: మండలంలోని ఎస్.కొత్తపల్లిలో తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన బోరు పైపులను దేవరాజుగట్టు సర్పంచ్ పగులకొట్టారని సర్పంచ్ వెన్నా సంజీవరాణి సోమవారం ఎంపీడీఓ జాన్‌సుందరానికి ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామం సమీపంలోని చెరువు వద్ద పంచాయతీ బోరు నుంచి పైపుల ద్వారా గ్రామంలోకి తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పైపులు పగలకొట్టడంతో గ్రామంలో తాగునీటికి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్షం కురవడంతో బోరు, పైపులు నీటిలో మునిగిపోయాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి దేవరాజుగట్టు సర్పంచ్ సొంత నిధులతో నూతన పైపులు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా కొడు పీర్ల పండగ

కొమరోలు: మండలంలోని సూరవారిపల్లి గ్రామంలో కొడు పీర్ల పండగను గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఉత్కంఠగా సాగాయి. ఎడ్ల పోటీలను వైఎస్సార్ సీపీ నాయకుడు కామూరి రమణారెడ్డి ప్రారంభించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.80 వేలను రమణారెడ్డి అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశం

కొనకనమిట్ల/పొదిలి రూరల్: పొదిలి, కొనకనమిట్ల మండలాల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశాలు, బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పొదిలిలోని మంజునాథ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పొదిలిలోని దర్శి రోడులో ఉన్న మంజునాథ కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పొదిలి అర్బన్, రూరల్ మండలాల పార్టీ శ్రేణుల సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షుడు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కొనకనమిట్ల మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. సమావేశాలకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశాలకు పార్టీ శ్రేణులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మార్కాపురం: మార్కాపురం డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన మార్కాపురం డిపో నుంచి కాణిపాకం, తిరుత్తణి, కంచి, శ్రీరంగం, మధురై, కన్యాకుమారి, రామేశ్వరం, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. టికెట్ ధర రూ.7500గా నిర్ణయించామని, భక్తులు, పర్యాటకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


కందులాపురం పంచాయతీ పరిధిలో అధ్వానంగా ఉన్న రహదారి


హజరత్‌గూడెం పంచాయతీ పరిధిలో అంతర్గత రోడ్డు ఇలా..

చినుకు పడితే చిత్తడే!

- అధ్వానంగా అంతర్గత రహదారులు
- చిన్నపాటి వర్షానికే బురదమయం
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


ఫైర్ ఆఫీసు సమీపంలో నిలిచిన నీరు

కంభం: చిరు జల్లులకే అంతర్గత రహదారులు బురదమయంగా మారుతున్నాయి. ఓ మోస్తరు జల్లులు కురిస్తే వీధులన్నీ జలమయం అవుతున్నాయి. వర్షం వెలిసిన తర్వాత గడప దాటి బయట అడుగు వేయాలంటేనే ప్రజలు చీదరించుకుంటున్న పరిస్థితి. అంతర్గత రహదారులపై రాకపోకలు సవ్యంగా సాగేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.

కంభం మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంతోపాటు హజరత్‌గూడెంలో రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనావాసాలు, గృహాలు ఉన్నచోట కంటే ప్రజలకు ఉపయోగపడని చోట, వారికి అనుకూలమైన నాయకులు ఉన్న ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించుకునేందుకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజలు అధిక సంఖ్యలో నివసించే ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాన్ని విస్మరించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో అంతర్గత రహదారులన్నీ బురదమయంగా మారిపోయి కనీసం నడిచేందుకు వీల్లేకుండా పోయింది, ద్విచక్రవాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు బురదలో కూరుకుపోతుండటంతో అవస్థలు పడుతున్నారు. కంభం అర్బన్ కాలనీలో పలు చోట్ల రోడ్లు వేసిన నాయకులు ప్రధాన రహదారిని వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యానగర్ కాలనీ, కృపామృతస్కూల్ రహదారి, పార్కువీధిలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారి, గౌతమి స్కూల్ వెనుకవైపు రహదారులు, అధ్వానంగా తయారవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం అధికార పార్టీ నాయకులు చెప్పినచోటే రోడ్లు వేస్తుండటంతో సామాన్య ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు అవసరమైన చోట సీసీరోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కంభం అర్బన్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి


పార్కు వీధిలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారి ఇలా..

వైఎస్సార్‌కు ఘన నివాళి



గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్‌లో గల వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి వేమిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సోమవారం గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశానికి ముందుగా వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్న విశా సుబ్బరత్నం కల్యాణ మండపానికి ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ గిద్దలూరు మున్సిపల్ విభాగం అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పాలుగుళ్ల సుబ్బారెడ్డి , కాతా నరసింహారెడ్డి, నాసరి శ్రీను, పాలుగుళ్ల నరసింహారెడ్డి, మత్తయ్య, దిలీప్‌రెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు బాబ్జి మాతృమూర్తికి తాటిపర్తి నివాళి


ఫాతిమా భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: సినీ దర్శకుడు బాబ్జి మాతృమూర్తి ఫాతిమా సోమవారం మృతి చెందారు. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆమె భౌతిక కాయనికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజభాస్కర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పర్తి చిన్న ఓబుల రెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల మునలారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.అరుణాబాయి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి


చిన్నబాబుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి చిన్నబాబు (52) మృతి చెందాడు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి.. చిన్నబాబు స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే బూచేపల్లి వెంట మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, జిల్లా యాక్టివిటీ సభ్యుడు బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాసరావు, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుంటు జాకోబు, గుంటు పోలయ్య, కర్నాటి ఆంజనేయ రెడ్డి, గొంగటి మహేష్‌రెడ్డి, రామగిరి హుస్సేన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినుకొండ కొండలరావు, ఐలూరి శ్రీనివాసరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రామారావు, కె.ప్రసాద్, పులిమి శివయాదవ్, డి.ఇస్మాయేల్, సయ్యద్ ముజాయిద్, తమ్మనేని సుబ్బారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఆది సుబ్బారావు, దుగ్గెంపూడి నాగేశ్వరరావు, వల్లపనేని వీరయ్యచౌదరి, ఐనోలు వెంకటేశ్వర్లు, చెన్నుబోయిన గురుమూర్తి, అచ్చయ్య, గొంగటి పోలిరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించాలి


పరికరాలు అందిస్తున్న ఎంఈఓ మస్తాన్‌నాయక్

పెద్దదోర్నాల: దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించి విద్యాపరంగా వారిని అభివృద్ధి చేసేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని ఎంఈఓ మస్తాన్‌నాయక్ పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం సమకూర్చిన వీల్ చైర్లు, రొటేటర్లను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మన్యూనతా భావాన్ని విడనాడి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఆయా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఈఆర్‌పీ షేక్ రిహానా బేగం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రథమ శ్రేణి క్షేత్రాలపై అవగాహన


మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ రమేష్

ముండ్లమూరు (దర్శి): పెద ఉల్లగల్లులో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ కంది పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కంది పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి తిరుమలరావు మాట్లాడుతూ వ్యవసాయ పథకాల గురించి వివరించారు. అనంతరం రైతులకు కంది విత్తనాలు, పురుగుమందులు పంపిణీ చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కాంతిరత్న, ఆంజనేయులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఈ-పంట నమోదు చేయాలి


మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్‌రావు

తాళ్లూరు: ఖరీఫ్‌లో డిజిటల్ క్రాప్ సర్వే పారదర్శకంగా ఉండేలా వీఆర్‌ఓలు, వీఏఏలు సమన్వయంతో ఈ-పంట నమోదు చేయాలని తహసీల్దార్ లక్ష్మీ నారాయణ, మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్ రావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, వీఏఏలకు డిజిటల్ క్రాప్ సర్వేపై సోమవారం అవగాహన కల్పించారు. రైతు సాగు చేసే పంట రకం వ్యవసాయదారుడి పూర్తి వివరాలు కచ్చితంగా ఉండాలన్నారు. నమోదు ప్రక్రియలో తప్పులు లేకుండా బాధ్యతగా పని చేయాలని సూచించారు.

పాఠశాలకు ఆడియో సిస్టం వితరణ



కంభం: మండలంలోని హజరత్‌గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం రిటైర్డ్ డీవైఈఓ కొప్పుల వెంకట్రావు మూవబుల్ ఆడియో సిస్టంను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షబ్బీర్ మాట్లాడుతూ.. పాఠశాలకు దాతల సహకారం అభినందనీయమన్నారు. స్టోర్ రూము ఏర్పాటుకు సహకరించిన వల్లంశెట్టి వెంకటేశ్వర్లు, ఆఫీస్ టేబుల్ అందజేసిన రిటైర్డ్ రైల్వే ఎస్సై గుర్రం శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రిటైర్డ్ డీవైఈఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, సరోజ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com